క్లుప్తంగా

నేడు కంటి వైద్య శిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని పెన్షనర్ల సంఘ భవనంలో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం గ్లోబల్ సూపర్ స్పెషాలి టీ హైదరాబాద్ వారిచే శుక్రవారం కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించే వైద్య శిబిరాన్ని పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి పరీక్షల తర్వాత అవసరమైన వారికి ఆపరేషన్లు ఉచితంగా చేయబడునని పేర్కొన్నారు.

ట్రై సైకిల్ వితరణ



పోశెట్టికి ట్రై సైకిల్ అందించిన సభ్యులు

సోన్: మండల కేంద్రానికి చెందిన దండుగుల పోశెట్టికి గురువారం గల్ఫ్ సేవా సమితి సభ్యులు రూ.పది వేల విలువైన ఎలక్ట్రిక్ ట్రై సైకిల్ అందించారు. పోశెట్టికి ప్రమాదం జరగడంతో కుడికాలు తొలగించారు. ఇది చూసి చలించిన ఎన్ఆర్ఐ బృందం అతడికి ట్రైసైకిల్ అందించారు. అష్టం మధు, నీలం రాజు, దేవుడల మహేశ్, అరుగుల రణధీర్, పట్టేపు హరీశ్, భోజన్న తదితరులు ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ ఎన్నికల బరిలో అర్షద్

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 5 నుంచి సెప్టెంబర్ 5 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించే యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో నిర్మల్ నియోజకవర్గ అసెంబ్లీ అధ్యక్ష బరిలో తాను ఉన్నట్లు జిల్లా కేంద్రానికి చెందిన సయ్యద్ అర్షద్ ఒక ప్రకటనలో తెలిపారు. 35 ఏళ్లలోపు వారు ఆన్‌లైన్ ద్వారా ఓటింగ్‌లో పాల్గొని గెలిపించాలన్నారు. కాంగ్రెస్ నాయకులు వారి ప్రాంతంలోని యువకులను ప్రోత్సహించి మెజార్టీ వచ్చేలా చూడాలని కోరారు.

అనారోగ్యంతో కళాకారుడి మృతి



జీవన్ (ఫైల్)

కుభీర్: మండల కేంద్రానికి చెందిన కళా కారుడు జీవీనోజీ జీవన్ (64) గురువారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన గతంలో గణేశ్, దుర్గాదేవి విగ్రహాలను తయారు చేసేవాడు. పెయిటింగ్ పనులతో పాటు వాచ్‌లను రిపేర్ చేసేవాడు. జీవన్ మృతిపై పలువురు సంతాపం తెలిపారు. ఈయన భార్య గతంలో మరణించగా..ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

వరంగల్ ఎన్ఐటీలో భైంసా విద్యార్థికి సీటు

భైంసాటౌన్: పట్టణంలోని రాంనగర్‌కు చెందిన లాభిశెట్టి ప్రవీణ్–రాధిక దంపతుల కుమారుడు ప్రభాస్ వరంగల్ ఎన్ఐటీకి ఎంపికయ్యాడు. ఇటీవల జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చి ఈసీఈ విభాగంలో సీటు పొందాడు. ప్రభాస్ పదో తరగతి వరకు స్థానిక ప్రైవేట్ పాఠశాలలో చదవగా, ఇంటర్ హైదరాబాద్‌లో పూర్తి చేశాడు. ఎన్ఐటీలో సీటు రావడంతో విద్యార్థిని పలువురు అభినందించారు.

వారసంత వేలం వాయిదా

తానూరు: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఈనెల 25న నిర్వహించాల్సిన వారసంత వేలంపాటను వివిధ కారణాలతో వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి జలంసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఈనెల 30న మంగళవారం వేలం నిర్వహిస్తున్నామని.. గ్రామస్తులు గమనించాలని కోరారు.

2వరకు ప్రవేశాలకు గడువు

ముధోల్: మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందేందుకు విద్యార్థులకు వచ్చే నెల రెండో తేదీ వరకు గడువు ఉందని ప్రిన్సిపాల్ డా.ఎం.సుధాకర్ అన్నారు. దోస్త్ స్పెషల్ ఫేజ్ ద్వారా ఈనెల 25 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు స్పెషల్ ఫేజ్ అడ్మిషన్లు నిర్వహిస్తామని.. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

గాయత్రి గోశాలకు విరాళం



చెక్కు ఇస్తున్న చిన్నారి కుటుంబసభ్యులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని ఇంద్రానగర్ కాలనీకి చెందిన నూకల విజయకుమార్ మనవరాలు విజయసాన్విత తన పుట్టినరోజున గురువారం నిర్మల్ సమీపంలో ఉన్న శ్రీ గాయత్రి గోశాలకు రూ. 5,555ను విరాళంగా అందజేశారు. గోశాల నిర్వాహకులు దోమల ప్రవీణ్‌కుమార్‌కు చెక్కు అందజేశారు. చిన్నారి తల్లిదండ్రులు మౌనిక చరణ్ పాల్గొన్నారు.

ముసురుతో కలుపు

- చేన్లలో పెరుగుతున్న పిచ్చిమొక్కలు
- వర్షాలతో ముందుకుసాగని పనులు
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు



కుంటాలలో కలుపు తీస్తున్న కూలీలు (ఫైల్)



కుంటాల మండలం వెంకూర్‌లో పత్తి చేనులో పెరిగిన కలుపు

కుంటాల: భూమిలో విత్తనం విత్తినప్పటినుంచి పంట దిగుబడి వచ్చే వరకు రైతులకు కష్టాలు తప్పడం లేదు. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో వ్యవసాయ పనులు సాగడం లేదు. పంట చేన్లలో వర్షపునీరు నిలిచి మొక్కల్లో ఎదుగుదల లోపించింది. మరోవైపు కలుపు మొక్కలు కూడా పెరుగుతుండటంతో అన్నదాతలు భయాందోళన చెందుతున్నారు.

అదనపు ఖర్చు..ఆర్థిక భారం..

కుంటాల మండలంలోని ఆయా గ్రామాల్లో వానాకాలంలో 12,450 ఎకరాల్లో పత్తి, 6,620 ఎకరాల్లో సోయా, 3,320 ఎకరాల్లో వరి పంటలను సాగు చేశారు. ఎడతెరిపి లేని వర్షాలతో పత్తి, సోయా పంటల్లోని మొక్కలకు పోషకాలు అందక ఎదగడం లేదు. కలుపు తొలగించేందుకు రైతులకు అదనంగా ఆర్థిక భారం పడుతుంది. వర్షం కారణంగా కలుపు తీయడం సాధ్యం కావడం లేదని.. కొందరు రసాయనాలను పిచికారీ చేస్తున్నారు.

మహారాష్ట్ర నుంచి కూలీలు..

గతేడాది వానాకాలంలో మండలంలో అధికంగా సోయా పంట సాగు చేశారు. అధిక వర్షాలు, తెగుళ్ల కారణంగా ఎకరాకు అర క్వింటాల్ దిగుబడి కూడా రాక కొందరు రైతులు నష్టపోయారు. ఈసారి పత్తి సాగుకు మొగ్గు చూపగా.. వర్షాల కారణంగా కలుపు మొక్కలు పెరిగిపోయాయి. ఇక్కడ దొరకపోవడంతో మహారాష్ట్రలోని మలక్‌జాం, అప్పారావుపేట్, శివుని ప్రాంతాల నుంచి కూలీలను రప్పించి కలుపును తొలగిస్తున్నారు. రవాణా ఖర్చులు పోను ఎకరాకు రూ.4వేల నుంచి రూ.5వేల వరకు కలుపు తీసేందుకే ఖర్చు అవుతుందని రైతులు వాపోతున్నారు. కూలీల కొరత సాగు రంగానికి గుది బండలా మారిందని దిగులు చెందుతున్నారు.



సోయా పంటలో నిలిచిన వర్షపునీరు

ఎడతెరిపి లేని వర్షంతో కుంటాల మండలంలో పత్తి, సోయా పంటల్లో వర్షపునీరు నిలుస్తుండటంతో వ్యవసాయ పనులు సాగడం లేదని రైతులు పేర్కొంటున్నారు. గురువారం మండలంలో 28.4మి.మీ. వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో సాయన్న తెలిపారు.

కలుపు మొక్కలు పెరిగాయి



రెండెకరాల్లో పత్తి పంట సాగు చేశా. మొక్కలు ఎదిగే దశలో వర్షాలు పడుతున్నాయి. ప్రస్తుతం చేనులో కలుపు ఎక్కువైంది. వర్షంలో కలుపు తీయాలంటే అధికంగా ఖర్చవుతుంది. మరోవైపు కూలీలు కూడా దొరకడం లేదు.

– ప్యాదరి భూమన్న, కుంటాల

కాలువల ద్వారా నీటిని బయటకు పంపించాలి

తుఫాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున రైతులు దిగులు చెందొద్దు. పత్తి పంటలో నీరు నిలవకుండా కాలువలు చేసుకొని బయటకు పంపించాలి. తద్వారా కలుపు మొక్కలను నివారించవచ్చు.

– సోమలింగారెడ్డి, ఏవో, కుంటాల

పాఠశాలల్లో సాంస్కృతిక దినోత్సవం

మామడ: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పెయింటింగ్, నృత్యం, పాటలు, కథలు, జానపద నృత్యాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు వివిధ ప్రాంతాల ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలను వివరించారు. అనంతరం కార్యక్రమాలను ఫొటోల రూపంలో ఉన్నతాధికారులకు అందించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

లోకేశ్వరం: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని రాజూర ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ అన్నారు. గురువారం మండలంలోని రాజూర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు ఏకపాత్రాభినయం, పాటల పోటీలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు నాగభూషన్, సురేందర్, విద్యావలంటీర్లు యశ్వంత్‌రావు, నవీన్, ముత్యంలు ఉన్నారు.



మామడ: కొరిటికల్ పాఠశాలలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



లోకేశ్వరం: రాజూర పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

అర్ధరాత్రి... ఆన్‌డ్యూటీ



మరమ్మతుల్లో పాల్గొన్న ఏడీఈ శ్రీనివాస్, సిబ్బంది

- కడెం మండలానికి నిలిచిన విద్యుత్
- రాత్రి వెళ్లి సరఫరా పునరుద్ధరించిన ఏడీఈ, సిబ్బంది

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ సమీపంలో అటవీ ప్రాంతంలో బుధవారం రాత్రి 11:30 గంటల సమయంలో 33 కేవీ విద్యుత్ లైన్ ఇన్సులేటర్ చెడిపోవడంతో కడెం మండలానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈవిషయం తెలిసి ఏడీఈ కోట్టి శ్రీనివాస్ వెంటనే సిబ్బందితో కలిసి వెళ్లి మరమ్మతులు చేశారు. చెడిపోయిన ఇన్సులేటర్ స్థానంలో కొత్త ఇన్సులేటర్ బిగించి విద్యుత్ సరఫ రాను పునరుద్ధరించారు. బుధవారం రాత్రి 11:30 గంటల ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపో గా.. గంటన్నర శ్రమించి రాత్రి ఒంటి గంట వరకు సమస్య పరిష్కరించారు. రాత్రి వచ్చి సమస్య పరిష్కరించిన విద్యుత్ సిబ్బందికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



స్తంభంపై ఇన్సులేటర్ బిగిస్తున్న సిబ్బంది

'మభ్యపెట్టేందుకే కేంద్ర బడ్జెట్‌పై ఆరోపణలు'

సారంగపూర్: హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టేందుకే కాంగ్రెస్ నాయకులు కేంద్ర బడ్జెట్‌పై లేనిపోని ఆరోపణ లు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు రావులరాంనాథ్ అన్నారు. మండలకేంద్రం సమీపంలోని కరుణాకర్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో గురువారం పార్టీ మండలాధ్యక్షుడు విలాస్ అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్‌రెడ్డి, రాంశంకర్‌రెడ్డి, గంగారెడ్డి, రాజేశ్వర్, పోతన్న, సాహెబ్‌రావు, వీరయ్య, కొరిపెల్లి రాజు, చాణక్య, తిరుమలచారి, వెంకటేశ్, వినోద్, తదితరులు ఉన్నారు.

కాడెద్దు మృతి

కడెం: మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామంలో గన్నె సత్తెన్నకు చెందిన ఎద్దు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. సాగు పనులకు వెళ్లిన ఎద్దు ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. కాడెద్దు విలువ రూ.60వేలు ఉంటుందని.. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

బాసర ఏఎస్సైకి ఎస్పీ అభినందనలు

బాసర: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ అంగోల్ల లక్ష్మారెడ్డి ఏఎస్సైగా పదోన్నతి పొందారు. గురువారం నిర్మల్‌లోని తన కార్యాలయంలో ఎ స్పీ జానకీ షర్మిల..లక్ష్మారెడ్డిని సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిర్లక్ష్యం చేయకుండా విధులు నిర్వర్తిస్తే ప్రతి ఒక్కరికి ఉన్నత స్థాయి చేరే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు.

పారిశుధ్య లోపం తలెత్తకుండా చూడాలి

ఖానాపూర్: కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో పారిశుధ్య లోపం తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని తర్లపాడ్, ఎక్బాల్‌పూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వీధులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

ఊరంతా చెత్తకుప్పలే..



బట్టిగల్లీలో మురుగుకాల్వ పక్కన పూడిక



విఠలేశ్వర మందిరం వద్ద..

- రోగాల బారిన పడుతున్నామంటున్న కుభీర్‌వాసులు
- చర్యలు తీసుకోవాలని వేడుకోలు



విఠలేశ్వర మందిరం వద్ద..

కుభీర్: మండల కేంద్రంలోని ప్రతి వీధిలో కొద్ది రోజులుగా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. గ్రామపంచాయతీ సిబ్బంది మురుగు కాల్వలను శుభ్రం చేశారు.. కానీ తీసిన చెత్తను తొలగించటంలో నిర్లక్ష్యం వస్తున్నారు. దీంతో వర్షాలకు చెత్త చిందర వందరగా మారి మళ్లీ మురికి కాల్వలోకే వెళ్తుంది. దుర్గంధం వెదజల్లడమే కాక దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని కాలనీల ప్రజలు వాపోతున్నారు. బట్టిగల్లీ, ఎస్సీ కాలనీ, పంచాయతీ కార్యాలయం ముందు, బట్టిగల్లీ హనుమాన్ ఆలయం వద్ద నెల రోజులుగా చెత్తకుప్పలను తొలగించడం లేదు. పశువైద్యశాల, ఉన్నత పాఠశాల గేటు వద్ద, విఠలేశ్వర మందిరం వద్ద రోడ్డుపై ప్లాస్టిక్ వస్తువులతో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి.

రోడ్డుపై నాటేసి నిరసన



అష్టలో రోడ్డుపై నాటు వేస్తున్న గ్రామస్తులు

ముధోల్: మండలంలోని అష్ట నుంచి ముధోల్ వెళ్లే రోడ్డు ఏటా వర్షాకాలంలో బురదమయంగా మారుతుందని గురువారం గ్రామస్తులు తెలిపారు. అధికారులకు విన్నవించినా పట్టించుకో వడం లేదని.. బురద రోడ్డుపై వరి నాటు వేసి వినూత్నంగా నిరసన తెలిపారు.

ఎమ్మెల్యే చొరవతో మరమ్మతులు

సమస్య తెలుసుకున్న ఎమ్మెల్యే రామారావుపాటిల్ ఆదేశాలతో అధికారులు వెంటనే రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించారు. అనంతరం స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

జర్నలిస్టులపై దాడి చేస్తే శిక్షించాలి



ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

నిర్మల్‌టౌన్: ఆదిలాబాద్‌లో జర్నలిస్టుపై దాడికి యత్నించిన వారిని కఠినంగా శిక్షించాలని నిర్మల్ పాత్రికేయులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ జానకీ షర్మిలను కలిసి వినతిపత్రం అందించారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు భాస లక్ష్మీనారాయణ, పూసల పోశెట్టి, అల్లం అశోక్, దాసరి వేణు, పెండెం శ్రీనివాస్, సాయన్న, అప్పల శ్రీను, సురేశ్, ఆనంద్ తదితరులు ఉన్నారు.

'బెదిరింపులు సరికాదు'

ముధోల్ : ఆదిలాబాద్‌లో ఓ ఛానల్ రిపోర్టర్‌ను రాజకీయ నాయకులు బెదిరించడం సరికాదని ముధోల్ బీజేపీ నాయకులు తాటేవార్ రమేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండే జర్నలిస్టులను బెదిరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సారూ.. మా రోడ్డు పట్టించుకోరూ

లక్ష్మణచాంద: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చామన్‌పెల్లి గ్రామంలో పలు అంతర్గత రోడ్లు బురదమయంగా మారాయి. దీంతో గ్రామస్తులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. గురువారం గ్రామంలోని పలు కాలనీల ప్రజలు రోడ్లపై నిలిచిన బురద తొలగించాలని నిరసన తెలిపారు. మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలని వేడుకున్నారు.



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

కుభీర్: ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలో చేర్చాలని ఆ సంఘం నాయకులు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ముదిరాజ్‌లు అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. ముదిరాజ్‌లను బీసీ–ఏలో చేరుస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. ఆ సంఘం నా యకులు సట్ల గంగాధర్, సూది రాజన్న తదితరులు ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ముదిరాజ్ సంఘం నేతలు

అమరుల త్యాగం మరువలేనిది

నిర్మల్‌ఖిల్లా: కార్గిల్ యుద్ధంలో తమ ప్రాణాలను త్యజించిన అమరుల త్యాగం మరువలేనిదని వక్తలు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని భాష్యం హైస్కూల్లో గురువారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. యుద్ధంలో అమరులైన వీర సైనికులకు నివాళులర్పించారు. భారతదేశ చిత్రపటంలో అమరులైన సైనికుల ఫొటోలు ఉంచి కొవ్వొత్తులు వెలిగించి అంజలి ఘటించారు. వీరుల త్యాగాలను విద్యార్థులకు వివరించారు. పాఠశాల ప్రెసిడెంట్ సుధాకర్ రెడ్డి, డైరెక్టర్ ప్రియాకపిల్, కరస్పాండెంట్ కౌశిక్, ప్రిన్సిపాల్ ప్రశాంత్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు,విద్యార్థులు

బాధ్యతలు స్వీకరించిన అధికారులు



బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్

ముధోల్: మండల నూతన తహసీల్దార్‌గా గురువారం శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరించారు. కాగా నూతన తహసీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అదే విధంగా మండల ఈవోగా శుద్ధవేణి బాధ్యతలు స్వీకరించారు. ఈయన బోథ్ మండలం పాడి(కే) గ్రామం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది ఘనస్వాగతం పలికారు.

ఖానాపూర్ ఎస్‌టీవోగా చంద్రశేఖర్

ఖానాపూర్: పట్టణంలోని ట్రెజరీ కార్యాలయం ఉపకోశాధికారిగా చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా జగిత్యాల నుంచి ఖానాపూర్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన ఆంజనేయులు బదిలీపై జగిత్యాల వెళ్లారు.

ఖానాపూర్ ఎంపీవోగా రత్నాకర్‌రావు

ఖానాపూర్: మండల పంచాయతీ అధికారిగా పెంబి ఎంపీవోగా పని చేసిన చిక్యాల రత్నాకర్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీవోగా పని చేసిన చంద్రశేఖర్ బదిలీపై జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం ఎంపీవోగా వెళ్లారు. ఈ మేరకు ఎంపీడీవో సునీతకు నూతన ఎంపీవో ఉత్తర్వు కాపీ అందజేశారు.

తానూరు ఎంపీవోగా నజీర్ హైమద్

తానూరు: మండల ఎంపీవోగా నజీర్ హైమద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎంపీవో మోహన్‌సింగ్ బదిలీపై కుభీర్ వెళ్లగా.. లక్ష్మణచాంద మండలంలో పని చేసిన నజీర్ హైమద్ తానూరు ఎంపీవోగా వచ్చారు.

లక్ష్మణచాంద ఎంపీడీవోగా రాధ

లక్ష్మణచాంద: మండలానికి నూతన ఎంపీడీవోగా రాథోడ్ రాధ బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన రాంప్రసాద్ ఉట్నూర్‌కు బదిలీపై వెళ్లగా.. మంచిర్యాల జిల్లా భీమారం ఎంపీడీవోగా పని చేస్తున్న రాథోడ్ రాధ లక్ష్మణచాందకు బదిలీ అయ్యారు.

మామడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా గంగాసాగర్

మామడ: మామడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా గంగాసాగర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఇక్కడ ఎంపీడీగా విధులు నిర్వహిస్తున్న సుశీల్‌రెడ్డి సెలవుపై వెళ్లడంతో.. కుభీర్ ఎంపీవో గంగాసాగర్‌రెడ్డి మామడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమితులయ్యారు.

లక్ష్మణచాంద ఎంపీవోగా అమీర్‌ఖాన్

లక్ష్మణచాంద: లక్ష్మణచాంద ఎంపీవోగా అమీర్‌ఖాన్ నియమితులయ్యారు. ఇక్కడ ఎంపీవోగా పని చేసిన నసీరుద్దీన్ బదిలీపై తానూర్ వెళ్లడంతో ముధోల్ ఎంపీవోగా విధులు నిర్వహించే అమీర్ ఖాన్ బదిలీపై లక్ష్మణచాందకు ఎంపీవోగా వచ్చారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దు

- భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్

సాక్షి స్పందన

భైంసాటౌన్: ట్రాఫిక్ అంతరాయం కలిగించేలా రోడ్లపై వాహనాలు నిలిపి ఉంచవద్దని భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ సూచించారు. పట్టణంలోని దుకాణాల ఎదుట, ప్రైవేట్ ఆస్పత్రుల ఎదుట ఇష్టారీతిన వాహనాలను పార్కింగ్ చేయడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 'పట్టణంలో పార్కింగ్ తిప్పలు' శీర్షికన ఈనెల 14న సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించారు. గురువారం సాయంత్రం పట్టణ సీఐ డి.రాజారెడ్డితో కలిసి ప్రధాన రోడ్డులో పర్యటించారు. రోడ్లపై రాకపోకలకు అంతరాయం కలిగించేలా వాహనాలు నిలిపి ఉంచొద్దని దుకాణదారులకు సూచించారు. వారి వెంట పలువురు పోలీసులు ఉన్నారు.



దుకాణాల ముందు పార్కింగ్ పరిశీలిస్తున్న ఏఎస్పీ అవినాష్ కుమార్, సీఐ రాజారెడ్డి